సాక్షి
ఏలూరు
ఆదివారం । 1 । అక్టోబర్ । 2023



సెల్‌ఫోన్ల రికవరీ

ఏలూరు జిల్లా పోలీస్ యంత్రాంగం సెల్‌ఫోన్ల రికవరీలో రికార్డు నమోదు చేస్తోంది. తొమ్మిదో సారి రూ.36.75 లక్షల విలువైన సెల్‌ఫోన్లను రికవరీ చేసింది. 8లో ▸



బాబు హయాంలో..

చంద్రబాబుకు సంఘీభావంగా ప్రజలంతా కంచాలు కొడుతూ ప్రజాశబ్దం వినిపించాలంటూ లోకేశ్ ఇచ్చిన పిలుపుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 8లో ▸



రాష్ట్రస్థాయి కరాటే పోటీలు

ఏలూరులో ఆదివారం ఏపీ షాటోఖాన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నామని నిర్వాహకుడు ఇబ్రహీం తెలిపారు. 8లో ▸

న్యూస్‌రీల్

2.16 లక్షల టన్నుల ధాన్యం సేకరణ



బి.లావణ్యవేణి, జేసీ

ఏలూరు(మెట్రో): జిల్లాలో రబీ (2022–23) పంట కాలంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రూ.442 కోట్ల విలువైన 2.16 లక్షల టన్నుల ధాన్యాన్ని 31,399 మంది రైతుల నుంచి సేకరించామని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 98 రైస్ మిల్లులు, ఇతర జిల్లాల్లో మిల్లులకు ధాన్యాన్ని మరాడించేందుకు తరలించామని పేర్కొన్నారు. వర్షాలకు తడిసిన, మొలకెత్తిన ధాన్యం సైతం కనీస మద్దతు ధరకు కొనుగోలు చేశామని తెలిపారు. ధాన్యాన్ని మరాడించగా 1.44 లక్షల టన్నులు బియ్యం రాగా అనుసంధానం చేసిన గోదాములు, భారత ఆహార సంస్థ, రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ గడువులోపు సేకరించిందని తెలిపారు. ధాన్యం కొనుగోలు, బియ్యం సేకరణకు సహకరించిన జిల్లా యంత్రాంగానికి అభినందనలు తెలిపారు. అలాగే వచ్చే ఖరీఫ్ ధాన్యాన్ని సమన్వయంతో సేకరించాలని అధికారులకు నిర్దేశించారు.

స్వచ్ఛతాహీ సేవలో జిల్లా ప్రథమం

ఏలూరు(మెట్రో): స్వచ్ఛతాహీ సేవ–2023 కార్యక్రమాల అమలులో రాష్ట్రంలో ఏలూరు జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. జిల్లాలో స్వచ్ఛతాహీ సేవ కింద 11,328 కార్యక్రమాలు పూర్తి చేశామన్నారు. 4,47,522 మంది వ్యక్తులు 21,67,677 గంటల పాటు పనిచేయడంతో ఏలూరు జిల్లాకు మొదటి స్థానం వచ్చిందన్నారు. స్వచ్ఛతాహీ సేవ కార్యచరణలో భాగంగా 9,602 చిత్రాలను సంబంధిత పోర్టల్‌లో అప్‌లోడ్ చేశామన్నారు.

వరంగల్ జిల్లా జడ్జిగా ప్రసన్న



జడ్జి ప్రసన్నను సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం న్యాయవాదుల బార్ అసోసియేషన్ సభ్యురాలు బి.ప్రసన్న తెలంగాణలోని వరంగల్ జిల్లా కోర్టులో 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన సందర్భంగా శనివారం పట్టణ బార్ అసోసియేషన్ కార్యాలయంలో సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొవ్వూరి అప్పిరెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు ఆమెను సత్కరించారు. వక్తలు మాట్లాడుతూ ప్రసన్న మరిన్ని ఉన్నత పదవులు సాధించాలని ఆకాంక్షించారు. సీనియర్ న్యాయవాదులు జి.శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ, ముత్తా రామారావు, డి.సూర్య రామారావు, మాకా శ్రీనివాసరావు, కె.కుసుమ హరినాథ్, తోట రాంబాబు, జీకే దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ హుండీ ఆదాయం లెక్కింపు



ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మవారి దేవస్థానంలో హుండీల ఆదాయాన్ని శనివారం లెక్కించారు 65 రోజులకు రూ.51,36,425 ఆదాయం లభించినట్టు సహాయ కమిషనర్, ఈఓ యర్రంశెట్టి భద్రాజీ తెలిపారు. ఈఓ కర్రి శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు (నాగన్న బాబు), ధర్మకర్తలు లెక్కింపును పర్యవేక్షించారు.

ఆరోగ్య సురక్ష.. అందరికీ రక్ష

ప్రజారోగ్యమే పరమావధి

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆరోగ్య శిబిరాలు
- తొలిరోజు 51 క్యాంపుల నిర్వహణ
- 19,491 మందికి ఓపీ సేవలు
- 288 మంది వైద్యుల పర్యవేక్షణ
- ప్రజాప్రతినిధుల హాజరు



ఏలూరు రూరల్: పాలగూడెంలో కేస్‌షీట్‌లో పేరు నమోదు చేయించుకుంటున్న గ్రామస్తులు



ఏలూరు రూరల్: వృద్ధులను తీసుకువస్తున్న వలంటీర్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: అందరికీ ఆరోగ్యం.. అందరికీ సంక్షేమం.. ఇది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆకాంక్ష. దీనికి అనుగుణంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాల నిర్వహణ ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. రెండు జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ఉన్నతాధికారులు వైద్యశిబిరాల్లో పాల్గొని ప్రజలకు అందుతున్న వైద్యసేవలను ప్రత్యక్షంగా పరిశీలించి వైద్యుల సేవలు కొనియాడారు. రెండు జిల్లాల్లో తొలిరోజు 51 వైద్యశిబిరాలను నిర్వహించగా 19,491 మందికి ఓపీ నమోదు చేసి మందులు పంపిణీ చేశారు. అలాగే రెండు జిల్లాల్లో కలిపి 594 మందికి మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ ఉన్న రిఫరల్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. మొత్తంగా 288 మంది వైద్యులు సేవలు అందించారు. తాడేపల్లిగూడెంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, తణుకులో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఏలూరులో 25 గ్రామాల్లో.. ఏలూరు జిల్లాలో 25 గ్రామాల్లో ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహించి 6,359 మందికి సేవలు అందించారు. వీరిలో 2,717 మంది పురుషులు, 3,642 మంది మహిళలు ఉన్నారు. ఆరోగ్య పరీక్షల అనంతరం 182 మందికి మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. అత్యధికంగా దెందులూరు మండలంలో 460 ఓపీ నమోదయ్యింది.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

	ఏలూరు జిల్లా	పశ్చిమగోదావరి జిల్లా
క్యాంపులు	25	26
ఓపీ సేవలు	6,359	13,132
ఉన్నత వైద్యానికి సిఫార్సు	182	412

ప్రజాప్రతినిధుల మమేకం

- చింతలపూడి నియోజకవర్గం రేచర్ల గ్రామంలోని వెల్‌నెస్ సెంటరులో ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా మెడికల్ క్యాంపును ప్రారంభించారు.
- దెందులూరు నియోజకవర్గంలో దెందులూరు మండలం చల్లచింతలపూడిలో, పెదవేగి మండలం భోగాపురంలో వైద్య శిబిరాలను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రారంభించారు.
- కైకలూరు నియోజకవర్గం కైకలూరు మండలం పెంచికలమర్రు గ్రామంలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఏలూరు డీఎల్‌పీఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.
- నూజివీడు నియోజకవర్గం ముసునూరు మండలం వేల్పుచర్లలో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప అప్పారావు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.
- పోలవరం నియోజకవర్గం బుట్టాయగూడెం మండలం రాజానగరంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.
- ఉంగుటూరు నియోజకవర్గం ఉంగుటూరు మండలం వెల్లమిల్లి, భీమడోలు మండలం సూరప్పగూడెంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ హాజరయ్యారు.
- ద్వారకాతిరుమల మండలం పి.కన్నాపురంలో గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు శిబిరాన్ని ప్రారంభించారు.

'పశ్చిమ'లో 26 క్యాంపులు

పశ్చిమగోదావరి జిల్లాలో 26 మెడికల్ క్యాంపులు నిర్వహించారు. గ్రామాల్లో 20, పట్టణాల్లో ఆరు శిబిరాలు ఏర్పాటుచేయగా మొత్తంగా 13,132 ఓపీ కేసులు నమోదయ్యాయి. వీరిలో పురుషులు 5,234 మంది, మహిళలు 7,082 మంది, చిన్నపిల్లలు 816 మంది, బాలింతలు 312 మంది ఉన్నారు. వైద్య పరీక్షల అనంతరం 412 మందిని ఉన్నత వైద్యానికి రిఫర్ చేశారు. 68 మంది స్పెషలిస్టు వైద్యులు, 52 మంది పీహెచ్‌సీ వైద్యులు సేవలందించారు.



పెదవేగి: ముండూరులో వృద్ధుడి ఆరోగ్య సమస్య తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



కైకలూరు: పెంచికలమర్రులో వైద్య‌శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు



బుట్టాయగూడెం: రాజానగరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



నూజివీడు: అన్నవరంలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



లింగపాలెం: కొత్తపల్లిలో శిబిరం వద్ద వైద్య సేవలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా



ద్వారకాతిరుమల: పి.కన్నాపురంలో శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ఆరోగ్య సురక్షతో నాణ్యమైన వైద్య సేవలు



సూరప్పగూడెంలో శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎమ్మెల్యే వాసుబాబు

భీమడోలు: నాణ్యమైన వైద్యసేవలు ప్రతిఒక్కరికీ అందాలన్న సంకల్పంతో జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. సూరప్పగూడెం ఎంపీపీ పాఠశాలలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబుతో కలిసి ఆయన ప్రారంభించారు. పేదలకు వైద్య సేవలను మరింత చేరువ చేసేలా సీఎం జగన్ వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. ఆరోగ్య సురక్షను 45 రోజులపాటు ఐదు దశల్లో నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని 27 మండలాల్లో 477 గ్రామాల్లో ఎంబీబీఎస్ వైద్యులు, మరో 168 మంది స్పెషాలిస్టులు వైద్య సేవలందిస్తారన్నారు. ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ ప్రజల అనారోగ్య సమస్యలను గుర్తించి మెరుగైన వైద్య సేవలందిస్తున్న ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. నాలుగున్నరేళ్లలో పేదల సంక్షేమానికి లక్షల కోట్లు వెచ్చించారన్నారు. అనంతరం శిబిరంలో విభాగాలను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. సర్పంచ్ వెజ్జు బాలాజీ, ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, ఎఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమజూనియర్, డీఎంహెచ్‌ఓ ఎస్.శర్మిష్ట, డీసీహెచ్ పాల్ సతీష్‌కుమార్, ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ రాజీవ్, ఎంపీడీఓ సీహెచ్ పద్మావతి దేవి, తహసీల్దార్ ఇందిరాగాంధీ, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్ పాల్గొన్నారు.



ఏలూరు రూరల్: పాలగూడెం శిబిరం వద్ద 104లో ఈసీజీ తీస్తున్న సిబ్బంది

నేడు భారీ ఎత్తున శ్రమదానం



వె.ప్రసన్న వెంకటేష్, కలెక్టర్

ఏలూరు(మెట్రో): స్వచ్ఛతాహీ సేవలో భాగంగా ఏక్ దిన్.. ఏక్ గంట.. ఏక్ సాత్ కార్యక్రమం కింద ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లా వ్యాప్తంగా భారీఎత్తున శ్రమదానం చేపట్టాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పరిశుభ్రత, పారిశుధ్య కార్మికుల సంక్షేమంపై దృష్టి సారించి, చెత్తరహిత భారతదేశాన్ని నెలకొల్పాలనే స్ఫూర్తితో జిల్లాలో స్వచ్ఛంద శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. జిల్లాలోని బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ఆలయ ప్రాంగణాలు, పర్యాటక ప్రదేశాలు, పార్కులు, చారిత్రక స్మారక చిహ్నాలు, నదీ ప్రవాహక ప్రాంతాలు, డ్రెయిన్లు అలాగే జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో శ్రమదానం చేపట్టాలన్నారు. ద్వారకాతిరుమల దేవస్థానంలో సుమారు వెయ్యి మంది కార్మికులతో శ్రమదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. అలాగే జిల్లావ్యాప్తంగా గంట పాటు శ్రమదానం చేసే కార్యక్రమంలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ కోరారు.

ఈ-శ్రమ్‌తో సామాజిక భద్రత

ఏలూరు (టూటౌన్): అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ–శ్రమ్ పోర్టల్‌ను ప్రవేశ పెట్టిందని ఉప కార్మిక కమిషనర్ పి.శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 3,58,390 మంది ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్నారని, మిగిలిన వారు తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. వలస కార్మికులు, డోమెస్టిక్ వర్కర్స్, వ్యవసాయ, చేతి వృత్తి, స్ట్రీట్ వెండర్స్, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, మత్స్యకారులు, ప్లాంటేషన్ వర్కర్లు, ఉపాధి హామీ కూలీలు, నిర్మాణ రంగ కార్మికులు, పాల వ్యాపారులు, భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులు, కొరియర్ బాయ్స్, లఘు వ్యాపారులు మొదలైన వారు అర్హులని పేర్కొన్నారు. 18–59 ఏళ్ల లోపు వయసు ఉండాలని, అర్హులు ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, సెల్ నంబర్‌తో గ్రామ/వార్డు సచివాలయం లేదా సీఎస్‌సీ సెంటర్ లేదా పోస్టాఫీస్‌లో సంప్రదించి ఉచితంగా నమోదు చేసుకోవచ్చని ఉప కార్మిక కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు.

దివ్యాంగులకు ఉద్యోగాలు

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర ప్రభుత్వ నైపుణ్య, వృత్తి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని విభిన్న ప్రతిభావంతుల కోసం ఉంగుటూరు మండలం నారాయణపురంలో డిగ్రీ కాలేజీలో శనివారం ప్రత్యేక జాబ్ మేళా నిర్వహించారు. 27 మంది విభిన్న ప్రతిభావంతులు ఉద్యోగాలు పొందినట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జీసీహెచ్ ప్రభాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. యూత్ 4 జాబ్స్ అనే సంస్థ సహకారంతో జాబ్‌మేళా ఏర్పాటుచేయగా 42 మంది దివ్యాంగులు హాజరయ్యారని, వారిలో 27 మంది ఉద్యోగాలు సాధించారని పేర్కొన్నారు.

యథావిధిగా పెన్షన్ల పంపిణీ



ఆర్.విజయరాజు, పీడీ

ఏలూరు (టూటౌన్): జిల్లాలో వైఎస్సార్ పెన్షన్ కానుక కింద అక్టోబర్ నెలకు 2,80,413 మందికి రూ.77.83 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందని డీఆర్‌డీఏ పీడీ ఆర్. విజయరాజు తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి పెన్షన్ల పంపిణీ ప్రారంభమవుతుందని, 2వ తేదీ గాంధీ జయంతి సెలవు రోజుల అయినా పంపిణీ యథావిధిగా సాగుతుందన్నారు.

వైఎస్సార్‌సీపీ 'డాక్టర్స్ వింగ్' నియామకం

జిల్లా అధ్యక్షుడిగా పద్మరాజు

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏలూరు జిల్లా డాక్టర్స్ వింగ్ నూతన కమిటీని నియమించారు. పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం జిల్లా నూతన కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ల వింగ్ జిల్లా అధ్యక్షుడి ఏవీఎస్ పద్మరాజు (ఏలూరు), ఉపాధ్యక్షులుగా డాక్టర్ తమలాల శ్రీను (దెందులూరు), డాక్టర్ ఉందుర్తి శ్రీనివాసరావు (పోలవరం), జనరల్ సెక్రటరీలుగా డాక్టర్ చలమాల సుబ్బారావు (నూజివీడు), డాక్టర్ జె.అజయ్‌కుమార్ రెడ్డి (పోలవరం), డాక్టర్ పసమట్ల సతీష్‌కుమార్ రాజు (ఉంగుటూరు), డాక్టర్ అజయ్‌చంద్ర (ఏలూరు), డాక్టర్ బొంతు రాంబాబు (చింతలపూడి) డాక్టర్ అడవాయి ప్రసాద్ (కైకలూరు), సెక్రటరీలుగా డాక్టర్ దార్ల వినోద్, డాక్టర్ మరీదు హరి, డాక్టర్ శీలం చక్రవర్తి, డాక్టర్ తాళ్లపూడి లక్ష్మణరావు, డాక్టర్ పెనుగొండ బాలకృష్ణ, డాక్టర్ గుమ్ములూరు లోకేష్, డాక్టర్ రిజ్వాన్ అహ్మద్, డాక్టర్ గురజాల లక్ష్మినారాయణ, డాక్టర్ కఠారి సీతారాంబాబు, డాక్టర్ మంగరాజు విజయ కుమార్, డాక్టర్ కేసిరెడ్డి జగన్నాథం, జాయింట్ సెక్రటరీలుగా డాక్టర్ బొబ్బర్ల ఆశీర్వాదం, డాక్టర్ కుసం వంశీ, డాక్టర్ బండి త్రినాథ్, డాక్టర్ పుచ్చకాయల విష్ణుమూర్తి, డాక్టర్ చిర్రా విష్ణు ప్రసాద్, డాక్టర్ ముఖర్జీ అహ్మద్, డాక్టర్ బల్ది వినోద్‌కుమార్, డాక్టర్ యర్రసాని శ్రీవిన్య, డాక్టర్ మంచిగంటి నాగరాజు, డాక్టర్ యాళ్ల జీవరత్నం, డాక్టర్ సామనపూడి సుధాకర్‌ను నియమించారు.

వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం రాష్ట్ర కమిటీలో స్థానం

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి (ప్రకాశం జిల్లా)ని నియమించారు. ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 76 మందితో వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం రాష్ట్ర కమిటీని నియమిస్తున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఏలూరు జిల్లాకు చెందిన డాక్టర్ తోట విజయలక్ష్మిప్రసన్నకుమార్ (బాజీ), గోగులమూడి రత్నరాజేష్, డాక్టర్ వల్లపు సత్యవేదం కార్యదర్శులుగా, పశ్చిమగోదావరికి చెందిన డాక్టర్ ఎర్రంశెట్టి వినయ్‌కుమార్ సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు.

క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీతారాంపురంలో క్షీరాభిషేకం చేస్తున్న ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న తదితరులు

నరసాపురం రూరల్: బేడ, బుడగజంగం కులస్తులను ఎస్సీలుగా గుర్తించాలని అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టి కేంద్రానికి పంపడంపై ఆ కులస్తులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. నరసాపురం మండలం సీతారామపురం సౌత్ గ్రామంలోని వైఎస్సార్ విగ్రహం వద్దకు పెద్ద ఎత్తున చేరుకుని సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కీర్తిస్తూ నినాదాలు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆశీస్సులతో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున.. బేడ బుడగ జంగం కులస్తులను ఎస్సీలుగా గుర్తించాలని శాసనసభలో తీర్మానం ప్రవేశ పెట్టారన్నారు. అప్పట్లో తెలుగుదేశం అధికారంలో ఉండగా తూతూ మంత్రంగా అమరావతిలో సభ కార్యక్రమం నిర్వహించి మోసం చేశారని పెండ్ర వీరన్న విమర్శించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన అనంతరం బేడ బుడగజంగం కులస్తుల సమస్యలను తెలుసుకుని వారికి ఆదుకోవడం కోసం అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టి కేంద్రానికి పంపారన్నారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బేడ బుడగజంగం కులస్తులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

బాబు హయాంలో.. కంచాలు కొడితే కేసులు

- కాపు ఉద్యమంలో కంచాలు మోగించిన వారిపై ఉక్కుపాదం
- జైల్లోని బాబు కోసం నేడు ప్రజాశబ్దం పిలుపుపై విమర్శలు



నాడు కాపు ఉద్యమంలో భాగంగా అమలాపురంలో కంచాలు కొడుతున్న కాపు నేతలు (ఫైల్‌ఫోటో)

సాక్షి ప్రతినిధి, కాకినాడ/ఏలూరు టౌన్: 'నవ్విపోదురు గాక మాకేటి సిగ్గు' అన్నట్టుగా తెలుగుదేశం నేతలు వ్యవహరిస్తున్నారు. వందల కోట్ల రూపాయల స్కిల్ స్కాంలో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో టీడీపీ అధినేత చంద్రబాబు 21 రోజులుగా రిమాండ్ ఖైదీగా ఉన్నారు. జైలుపాలైన చంద్రబాబుకు సంఘీభావంగా ప్రజలంతా కంచాలు కొడుతూ ప్రజాశబ్దం వినిపించాలంటూ లోకేశ్ ఇచ్చిన పిలుపుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం రాత్రి ఏడు గంటల నుంచి ఐదు నిమిషాలు పాటు కంచాలు, గరిటెలు, వాహనాల హారన్‌లు, అవేవీ అందుబాటులో లేకపోతే విజిల్‌తోనైనా ప్రజాశబ్దం చేయాలని లోకేశ్ చేసిన ట్వీట్ ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో చర్చనీయాంశంగా మారింది. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా ప్రతిపక్షంలో మరోలా ప్రవర్తించడం టీడీపీ నేతలకు పరిపాటని పరిశీలకులు ఎద్దేవా చేస్తున్నారు. నాడు కాపు ఉద్యమంలో భాగంగా కంచాలపై శబ్దాలు చేస్తేనే అక్రమ కేసులు పెట్టారని.. ఇప్పుడు అవినీతితో జైలుపాలైన చంద్రబాబుకు మద్దతుగా కంచాలు, ప్లేటులతో ప్రజా శబ్దం చేయమని లోకేష్ ట్వీట్ చేయడం సిగ్గు చేటని ఆక్షేపిస్తున్నారు. అప్పుడు కాపు సామాజికవర్గం న్యాయమైన డిమాండ్ కోసం నిరసన తెలిపితే అక్రమ కేసులతో వేధించి ఇప్పుడు అదే పద్ధతిలో చంద్రబాబుకు సంఘీభావం తెలియచేయమనడం ఆ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనమంటున్నారు.

లోకేశ్ ట్వీట్‌పై విమర్శలు

తమ పార్టీ అధినేత కటకటాలపాలై దిక్కుతోచక తెలుగు తమ్ముళ్లు తీవ్ర నిరాశ, నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ జనరంజక పాలనతో గోదావరి జిల్లాల్లో ఉనికి కోసం టీడీపీ తంటాలుపడుతోంది. 21 రోజులుగా చంద్రబాబు జైలులో ఉన్నా గోదావరి జిల్లాల్లోని ప్రజల సంగతి అటుంచితే పార్టీ నేతల కనీస స్పందన కూడా కొరవడిందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు గగ్గోలు పెట్టడం బహిరంగ రహస్యమే. బాబుకు మద్దతు అన్నట్టు లోకేష్ చేసిన ట్వీట్‌పై పార్టీ శ్రేణులే పెదవి విరుస్తున్నాయి.

కాపు ఉద్యమంపై దమనకాండ

2016లో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా కాపు ఉద్యమం ప్రధానంగా తూర్పు గోదావరి జిల్లాలో ఉధృతంగా సాగింది. ఆ క్రమంలో జనవరి 31న తుని సంఘటన చోటుచేసుకుంది. ఆనాటి సర్కారే తెరవెనుక నడిపిన మంత్రాంగం వల్లే సంఘటన చోటుచేసుకుందనే ఆరోపణలు అప్పట్లోనే వినిపించాయి. ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభం సహా ఆ కుటుంబంలోని మహిళలని కూడా చూడకుండా టీడీపీ సర్కార్ దమనకాండకు పాల్పడింది. దీనిపై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా కాపు సామాజిక వర్గీయులు శాంతియుత పంథాలో బాబు ప్రభుత్వ తీరును ఎండగడుతూ నిరసన వ్యక్తంచేశారు. పెద్దాపురం, పిఠాపురం, గొల్లప్రోలు, జగ్గంపేట, కిర్లంపూడి, పి.గన్నవరం, అంబాజీపేట, కొత్తపేట, రాజోలు, మామిడికుదురు, ముమ్మిడివరం తదితర మండలాల్లో ఇళ్ల వద్దనే కంచాలు, పళ్లాలు, ప్లేటులను గరిటెలతో దరువు వేస్తూ 'కాపుల ఆకలి కేకలు' అంటూ నినదించారు. శాంతియుతంగా ఇళ్లవద్ద, రోడ్డుకు ఇరువైపులా కూర్చుని కంచాలపై దరువువేసిన వారిపై కేసులు బనాయించారు. మహిళలు, చిన్నారులు అని కూడా చూడకుండా అందరిపైనా సెక్షన్ 341 కింద కేసులు పెట్టారు. రోడ్డుపైకి వచ్చి రాస్తారోకోలు, ర్యాలీలు నిర్వహించారంటూ పలు మండలాల్లో సుమారు 400 కేసులు మోపగా అందులో ఒక్క అమలాపురంలోనే 80 నుంచి 100 వరకు ఉండటం గమనార్హం.

కేసులు ఎత్తేసిన సీఎం వైఎస్ జగన్

ప్రతి మండలంలోనూ కాపు వర్గీయులపై అక్రమంగా కేసులు పెట్టి వేధించారు. ఈ కేసుల ప్రహసనం 2016 జనవరి నుంచి 2017 మార్చి వరకు కొనసాగింది. అక్రమ కేసులు ఎత్తేయాలని సామాజికవర్గ నేతలు, యువత వేడుకున్నా చంద్రబాబు సర్కారు మనసు కరగలేదు. చివరకు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దమనసు చాటుకున్నారు. కాపు ఉద్యమ సందర్భంలో పెట్టిన అక్రమ కేసులన్నింటిని ఎత్తేశారు.

ఉమ్మడి పశ్చిమలో కాపులపై కేసులు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కాపు ఉద్యమంపై చంద్రబాబు సర్కారు ఉక్కుపాదం మోపింది. కాపులు శాంతియుతంగా కంచాలను గరిటెలతో కొట్టి తమ నిరసన తెలిపారు. ర్యాలీలు చేస్తే సెక్షన్ 341 కింద అనేక మందిపై కేసులు నమోదు చేశారు. ఉమ్మడి పశ్చిమలో భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం, ఏలూరు, ఉంగుటూరు తదితర ప్రాంతాల్లో కాపులు నిరసన తెలిపితే కేసులు నమోదు చేశారు. సుమారుగా 250 మందికి పైగా కాపులపై ఆనాడు కేసులు పెట్టారు.

రూ. 36.75 లక్షల విలువైన ఫోన్ల రికవరీ



సెల్‌ఫోన్ అందజేస్తున్న జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, చిత్రంలో సీసీఎస్ సీఐ మురళీకృష్ణ

ఏలూరు టౌన్ : ఏలూరు జిల్లా పోలీస్ యంత్రాంగం సెల్‌ఫోన్ల రికవరీలో రికార్డు నమోదు చేస్తోంది. జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి సారథ్యంలో సీసీఎస్, సైబర్ క్రైమ్ పోలీసులు తమ సత్తా చాటుకుంటున్నారు. ఏకంగా జిల్లాలు, రాష్ట్రాలు దాటి మరీ సెల్‌ఫోన్ల రికవరీ చేస్తున్నారు. ఏలూరు జిల్లాలో 9వ సారి భారీఎత్తున సెల్‌ఫోన్లు రికవరీ చేశారు. ఏకంగా రూ.36.75 లక్షల విలువైన మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేశారు. ఈ మేరకు ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి వివరాలు వెల్లడించారు.

ఏలూరు జిల్లా వ్యాప్తంగా 175 సెల్‌ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేశారు. బాధితులు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయగా సీసీఎస్, సైబర్ క్రైమ్ పోలీసులు వేటాడి మరీ సెల్‌ఫోన్లు రికవరీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా, ఎన్టీఆర్, అంబేద్కర్ కోనసీమ, కృష్ణా, విశాఖపట్నం, తెలంగాణ తదితర ప్రాంతాలకు వెళ్ళి పోలీసులు సెల్‌ఫోన్లను రికవరీ చేయటం విశేషం. సెల్‌ఫోన్లు చోరీ లేదా పోగొట్టుకుంటే సైబర్‌క్రైమ్‌కు వాట్సప్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ మేరీ ప్రశాంతి సూచించారు. సీసీఎస్ సీఐ సీహెచ్‌వీ మురళీకృష్ణ, సైబర్‌క్రైమ్ ఎస్ఐ రాజా, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

ఏలూరు జిల్లాలో రికవరీ ఇలా :

- ఏలూరు జిల్లాలో 9 సార్లు 1,178 సెల్‌ఫోన్లు రికవరీ చేశారు. వీటి విలువ సుమారుగా రూ.2.42 కోట్లు ఉంటుంది. ఇప్పటి వరకూ 2278 మంది తమ ఫోన్లు పోగొట్టుకున్నామని ఫిర్యాదు చేయగా 52 శాతం మేర రికవరీ చేసినట్లు ఎస్పీ మేరీ ప్రశాంతి తెలిపారు.
- మొదటి విడత 80 సెల్ ఫోన్లు, విలువ రూ.16 లక్షలు
- రెండో విడత94 సెల్‌ఫోన్లు, విలువ రూ. 20.50 లక్షలు
- 3వ విడత 108 సెల్‌ఫోన్లు, విలువ రూ.22లక్షలు
- 4వ విడత 103 సెల్‌ఫోన్లు, విలువ రూ.21.21లక్షలు
- 5వ విడత116 సెల్‌ఫోన్లు, విలువ రూ.25.66 లక్షలు
- 6వ విడత 207 సెల్‌ఫోన్లు, విలువ రూ.41.40లక్షలు
- 7వ విడత 113 సెల్‌ఫోన్లు, విలువ రూ. 22.60లక్షలు
- 8వ విడత 182 సెల్‌ఫోన్లు, విలువ రూ. 36.40లక్షలు

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

పోలవరం రూరల్: పోలవరం మండలం ఎల్ఎన్ డీపేట గ్రామంలో ఈ నెల 28న జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు. కుటుంబ గొడవల నేపథ్యంలో అడ్డు వెళ్లిన వ్యక్తిని గొడ్డలితో దాడి చేసిన ఇళ్ల వీరబాబు అనే వ్యక్తిని అరెస్టు చేసి జంగారెడ్డిగూడెంలో హాజరుపరచగా, 14 రోజులు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న మహిళా పోలీస్ మౌనిక రాణి

ద్వారకాతిరుమల: మండలంలోని సీహెచ్ పోతేపల్లి సచివాలయం మహిళా పోలీస్ ఆర్.మౌనిక రాణి మతిస్థిమితం సరిగ్గా లేక ఇంటి నుంచి తప్పిపోయిన బాలుడిని శనివారం అతని తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. వివరాల ప్రకారం.. ఉంగుటూరు మండలం తిమ్మయ్యపాలెంకు చెందిన చింతా అర్జునరావు, కుమారి దంపతుల కుమారుడు గణేష్ మానసిక వైకల్యంతో బాధపడుతున్నాడు. ఇంటి నుంచి తప్పిపోయిన గణేష్ శుక్రవారం రాత్రి మద్దులగూడెంకు చేరుకున్నాడు. మహిళా పోలీస్ మౌనిక రాణి అతడిని సంరక్షించి, ఆచూకీ కోసం విచారణ చేపట్టారు. ఎస్సై టి.సుధీర్, చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారి సూర్య చక్రవేణిల సాయంతో వివరాలు సేకరించారు. అనంతరం సర్పంచ్ చెలికాని ప్రవీణ్, వలంటీర్ అనిల్, అంగన్‌వాడీ కార్యకర్త రామలక్ష్మి సమక్షంలో వారి తల్లిదండ్రులకు బాలుడిని అప్పగించారు.

ఏలూరులో రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు



ఏలూరులో నిర్వహించనున్న కరాటే పోటీల లోగో

ఏలూరు రూరల్: ఏలూరులో ఆదివారం ఏపీ షాటోఖాన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నామని పోటీల నిర్వాహకుడు, ఇండియా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ ఎం.ఇబ్రహీం భేగ్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక టొబాకో మర్చంట్స్ కల్యాణ మండపంలో జరిగే ఈ పోటీలకు ఆంధ్ర, తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో కరాటే సాధకులు తరలిరానున్నారని పేర్కొన్నారు.

సీసీ కెమెరాల సాయంతో సొత్తు స్వాధీనం



సొమ్మును అప్పగిస్తున్న ఎస్ఐ నంబూరు చంటిబాబు

నూజివీడు: సీసీ కెమెరాల సాయంతో ఆగిరిపల్లి పోలీసులు పోయిన సొమ్మును స్వాధీనం చేసుకొని బాధితురాలికి అప్పగించారు. కృష్ణాజిల్లా గన్నవరం మండలం వీరపనేనిగూడెంకు చెందిన గుర్రం రాములమ్మ తన మేనకోడలు ఫంక్షన్ నిమిత్తం సరుకులు కొనుగోలుకు సెప్టెంబరు 28న ఆగిరిపల్లి వచ్చింది. సరుకుల దుకాణం వద్ద పర్సు మరిచిపోయి మందుల షాపు వద్దకు వెళ్లింది. తిరిగి సరుకుల దుకాణం దగ్గరకు వెళ్లి చూడగా పర్సుతో పాటు అందులో ఉన్న రూ.14 వేల నగదు పోయిందని గ్రహించి ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్ఐ నంబూరు చంటిబాబు వెంటనే స్పందించి కానిస్టేబుల్ అశోక్ సాయంతో సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. ఆగిరిపల్లి మండలం కలటూరుకు చెందిన దినసరి కూలీ డబ్బు తీసినట్లు తేలింది. అతనిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చిన అనంతరం అతని నుంచి రూ.14 వేలు నగదును రాములమ్మకు శనివారం ఇప్పించారు.

● గడపగడపకు సంక్షేమం



పెదవేగి : మండలంలోని భోగాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతుడు రాజశేఖర్

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని శ్రీనివాసపురంలో రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. శ్రీనివాసపురం గ్రామానికి చెందిన పులపాకుల రాజశేఖర్ (32) శనివారం ద్విచక్ర వాహనంపై శ్రీనివాసపురం శివారులో ఉన్న పొలానికి వెళ్లాడు. తిరిగి 2 గంటల సమయంలో పొలం నుంచి ఇంటికి వస్తుండగా శ్రీనివాసపురం శివారులో ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యాడు. దీంతో వాహనం అదుపు తప్పి కింద పడిపోవడంతో రాజశేఖర్ తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో స్థానికులు, బంధువులు జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు రాజశేఖర్‌కి భార్య నాగవల్లి, ముగ్గురు మగ పిల్లలు ఉన్నారు.

21న ప్రత్యేక లోక్ అదాలత్



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జ్ కార్యదర్శి బుల్లికృష్ణ

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 21న ప్రత్యే లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జ్ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కేకేవీ బుల్లి కృష్ణ తెలిపారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా భవన్‌లో శనివారం నిర్వహించిన ప్యానల్ లాయర్లు, పారా వలంటీర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా కోర్టులున్న అన్ని ప్రదేశాలల్లో నిర్వహించే ప్రత్యేక లోక్ అదాలత్‌లో వాహన ప్రమాద బీమా కేసులు, రెవెన్యూ కేసులుకు సంబంధించి పరిష్కారం చేసుకోవచ్చన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం ఉమ్మడి జిల్లా పరిధిలోని అన్ని కోర్టుల్లో శనివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు.

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.